క్లుప్తంగా

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఉయ్యూరు: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. మండలంలోని గండిగుంట గ్రామంలో పీఏసీఎస్ చైర్మన్ పాలడుగు శివరామకృష్ణ ఆధ్వర్యంలో యువతకు క్రికెట్ కిట్లు, వాలీబాల్‌కిట్లు, క్యారమ్స్ బోర్డును అందించారు. ఈ కిట్లను సోమవారం రాత్రి ఎమ్మెల్యే పార్థసారథి అందించి యువత గ్రామీణ క్రీడల వైపు ఆకర్షితులయ్యేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పెనమలూరు: పోరంకిలో వేంచేసి ఉన్న పద్మావతి గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామివారి ఆలయంలో శ్రీవారి తొమ్మిదో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో మంగళవారం ఉదయం సుప్రభాత సేవ చేసిన అనంతరం స్వామివార్లకు ప్రత్యేకంగా అలంకరించి పెళ్లి కుమారుడిని చేశారు. సాయంత్రం విష్వక్సేనపూజ, దీక్షాధారణ, అంకురార్పణ హోమం జరిపించారు. ఆలయంలో బుధవారం శ్రీశ్రీశ్రీ పరమహంస పరివ్రాజకులు త్రిదండి అష్టాక్షరి సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో శ్రీవారికి పంచామృత స్నపన 108 వెండి కలశాలతో అభిషేకం చేస్తారు. సాయంత్రం తిరు వీధుల్లో ఉత్సవం , సుదర్శనయాగం జరుపుతారు.

రేపటి నుంచి యోగా ఉత్సవాలు

పెనమలూరు: కానూరులో అంతర్జాతీయ యోగా దినోత్సవం చేస్తున్నామని యోగ సాధన సమితి వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ తెలిపారు. ఆయన మంగళవారం వివరాలు తెలుపుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 1వ తేదీ నుంచి 21వ తేదీ వరకు యోగా విశిష్టతను ప్రజలకు తెలియజేయాలని ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. మోకాళ్లు, నడుము, మెడ నొప్పులు , శ్వాస, జీర్ణ సమస్యలు సుగర్ వ్యాధులను యోగాతో చికిత్స చేసే విధానం తెలియజేస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు కానూరు అశోక్‌నగర్‌లో తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

బదిలీలలో దివ్యాంగులకు ప్రాధాన్యం ఇవ్వాలి

పెనమలూరు: గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీలలో వికలాంగులకు ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర గ్రామ వార్డు దివ్యాంగుల ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ప్రేమ్ సుధాకర్ కోరారు. ఆయన మంగళవారం గంగూరులో మాట్లాడారు. సచివాలయాల్లో బదిలీలు జరగటానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగీకరించటంపై హర్షం వ్యక్తం చేశారు. దివ్యాంగుల ఉద్యోగుల సమస్యలు గుర్తించి న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర నాయకులతో కలిసి ముఖ్య కార్యదర్శికి వినతిపత్రం అందజేశామన్నారు.

సంపద తయారీ కేంద్రాలు వినియోగించాలి

ఉంగుటూరు: సంపద తయారీ కేంద్రాల వినియోగం వలన చెత్త రహిత గ్రామాలు సాధ్యమవుతాయని ఎంపీడీవో శేషగిరిరావు అన్నారు. మిషన్ లైఫ్ ప్రచారంలో భాగంగా వెల్దిపాడు గ్రామాన్ని ఎంపీడీవో సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి చెత్త సంపద తయారు కేంద్రాల్లో వర్మీకంపోస్ట్ ఎరువులు తయారు చేసి పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేసుకోవచ్చన్నారు. ప్లాస్టిక్ వినియోగం వలన పర్యావరణానికి కలిగే అనర్థాలను ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ బాషా, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు పోలీస్ సర్కిల్ కార్యాలయానికి శంకుస్థాపన

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్ పోలీస్ సర్కిల్ కార్యాలయం నూతన భవన నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన నిర్వహించనున్నట్లు సీఐ అల్లు నవీన్ నరసింహామూర్తి చెప్పారు. స్థానిక హనుమాన్ నగర్ రాజుల కాలనీలో సుమారు 10 సెంట్ల స్థలంలో నూతన భవనం నిర్మించనున్నట్లు తెలిపారు. ఎస్పీ పి.జాషువా, గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ చేతుల మీదుగా శంకుస్థాపన, పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

కంకిపాడులో వర్షం

కంకిపాడు: వాతావరణం ఒక్కసారిగా మేఘావృతమై మోస్తరు వర్షం కురిసింది. అప్పటి వరకూ ఎండ వేడిమికి అల్లాడిన ప్రజలు ఊరట పొందారు. మంగళవారం ఉదయం కంకిపాడు పరిసర ప్రాంతాల్లో మోస్తరు వాన పడింది. ఒక్కసారిగా ఆకాశం కారుమబ్బులు కమ్మేసి ఈదురుగాలులు వీచాయి. ఈదురుగాలికి పిడుగులు కూడా తోడై వర్షం కురవటంతో పల్లపు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచింది. కంకిపాడు అండర్ పాస్, బస్టాండ్, ప్రధాన రహదారి మార్జిన్‌లలో నీరు నిలిచిపోయి రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

ఇది జవాబుదారీ ప్రభుత్వం

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, చిత్రంలో సలహాదారుడు నాగార్జునరెడ్డి

పెనమలూరు: ప్రజలకు జవాబుదారీగా ఉండే వ్యవస్థను సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసి, పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్నారని పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ(పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్) సలహాదారుడు పి.నాగార్జునరెడ్డి ఎమ్మెల్యేతో కలిసి మంగళవారం పెనమలూరు మండలంలో విస్తృతంగా పర్యటించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే పార్థసారథి పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేడు నేరుగా అందుతున్నాయన్నారు. గ్రామాలలో పంట బోదెలు, పంటకాలువలు పూడిక తీసి రైతులకు మేలు జరిగే విధంగా ఉపాధి పనులు చేయాలని అధికారులను సూచించారు. అలాగే గ్రామాలలో లింకు రోడ్లు కూడా అభివృద్ధి చేయాల్సిన అవసర ముందన్నారు. ఉపాధి కూలీల సమస్యలు పరిష్కారం చేసే విధంగా అధికారులు దృష్టిపెట్టాలని అన్నారు. చంద్రబాబు నవరత్నాలను కాపీ కొట్టి అవే పథకాలు ప్రకటించారని తెలిపారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే మరలా జన్మభూమి కమిటీల చేతిలోకి పేదల జీవితాలు చిక్కుకుంటాయని అన్నారు.

జగనన్నతోనే అన్ని వర్గాలకు న్యాయం..

జగనన్న పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ప్రభుత్వ సలహాదారుడు పి.నాగార్జునరెడ్డి అన్నారు. మండల పరిషత్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగనన్న అధికారం చేపట్టిన తర్వాతే పేదలు, మహిళలు, రైతుల జీవితాల్లో వెలుగు నిండిందన్నారు. సచివాలయ వ్యవస్థతో అవినీతిలేని పాలన అందిస్తున్నామన్నారు. వలంటీర్ల సేవలతో ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్నామని అన్నారు. జగనన్నకు అందరు మద్దతు పలికి మరల సీఎం చేయాలని కోరారు.

విస్తృతంగా పర్యటన..

అంతకుముందు నాగార్జునరెడ్డి పోరంకిలో వైఎస్సార్ జలకళ బోరుకు శంకుస్థాపన చేశారు. జిల్లాలో నాలుగువేల బోర్లు ఇప్పటి వరకు రైతుల కోసం ఏర్పాటు చేశామన్నారు. గంగూరులో ఉపాధి కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పేదలకు మరింత ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. పెనమలూరు, వణుకూరు గ్రామాలలో జగనన్న లేఅవుట్లలో నిర్మించిన గృహాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. సమావేశంలో ఆర్టీసీ జోన్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, డీఆర్‌డీఏ ప్రసాదరావు, డ్వామా పీడీ సూర్యనారాయణ, జిల్లా పరిషత్ డెప్యూటీ సీవో జి. శ్రీనివాసరావు, డీఎల్‌డీవోలు సుబ్బారావు, నాంచారావు, ఏవో లోయశివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

● నేడే శుభ ప్రారంభం



వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ కార్యాలయం బుధవారం ప్రారంభించనున్నారు. కానూరు వందడుగుల రోడ్డులో సువిశాలమైన ప్రాంగణంలో వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి నిర్మాణం చేయించారు. ఈ కార్యాలయాన్ని బుధవారం 8.12 గంటలకు ఎమ్మెల్యే పార్థసారథి పార్టీ శ్రేణులతో కలిసి ప్రారంభించనున్నారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న పార్టీ నేతలు, కార్యకర్తలు ఈ ప్రారంభం కార్యక్రమంలో పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయం పేర్కొంది.

\- పెనమలూరు

'పది'లో టాపర్లకు ఎమ్మెల్యే వంశీ అభినందన



గన్నవరం: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన స్థానిక చైతన్య స్కూల్ విద్యార్థులను ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అభినందించారని పాఠశాల ప్రిన్సిపాల్ గాయత్రి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోనే ప్రథమ స్థానం సాధించిన ఎస్.లిఖిత, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన సీహెచ్.తన్మయి, సీహెచ్. రాజ్యలక్ష్మిలకు ఎమ్మెల్యే పుష్పగుచ్ఛాలు అందజేసి ప్రశంసించినట్లు పేర్కొన్నారు.

మార్కెట్ విలువలు పెంచొద్దని వినతి

కంకిపాడు: భూముల మార్కెట్ విలువలను పెంచొద్దని దస్తావేజు లేఖరుల వృత్తి పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మలపల్లి హరికృష్ణ కోరారు. కంకిపాడులోని ఆయన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. హరికృష్ణ మాట్లాడుతూ జూన్ 1వ తేదీ నుంచి మార్కెట్ విలువలను పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సర్వర్ సమస్యలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి మార్కెట్ విలువల పెంపుదలను నిలుపుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ కార్యాలయానికి మెయిల్ ద్వారా వినతి పత్రాన్ని పంపామని వివరించారు.

మజ్జిగ పంపిణీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ హనుమాన్‌జంక్షన్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. స్థానిక నూజివీడురోడ్డులోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం వద్ద మానవత ఏర్పాటు చేసిన చలివేంద్రంలో పాదచారులు, ప్రయాణీకులు, భక్తులకు మజ్జిగ అందించారు. దాత ఆరేపల్లి శివరామప్రసాద్, మానవత జిల్లా అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు, హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు, సినీయర్ సభ్యులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవో బదిలీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు ఇన్‌చార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న కె.ప్రభాకరరావు ఉద్యోగోన్నతిపై పూర్తి స్థాయి ఎంపీడీవోగా గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్డీగా పని చేస్తున్న ప్రభాకరరావు కొంతకాలంగా బాపులపాడు ఎంపీడీవో పోస్టు ఖాళీగా ఉండటంతో ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఉద్యోగోన్నతిపై బదిలీ అయిన ఆయనకు పలువురు ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయం సిబ్బంది అభినందనలు తెలిపారు.

వైభవంగా కల్యాణోత్సవం



మాదాసురవారిపాలెంలో నిర్వహించిన అన్నసంతర్పణను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

కంకిపాడు: మండలంలోని కోలవెన్ను శివారు మాదాసువారిపాలెంలో వేంచేసిన శ్రీ భక్తప్రపత్తి ఆంజనేయస్వామి, సువర్చలాదేవి వార్ల దేవస్థానంలో వార్షిక కల్యాణోత్సవం సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ఆలయ ప్రాంగణంలో వేదమంత్రాల నడుమ భక్త ప్రపత్తి ఆంజనేయ స్వామి, సువర్చలాదేవి వార్లకు కల్యాణాన్ని జరిపించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. వీధుల్లో ఊరేగిన స్వామి వారికి భక్తులు మొక్కుబడులు సమర్పించారు. కల్యాణోత్సవంలో భాగంగా మంగళవారం గ్రామంలో అన్నసంతర్పణ నిర్వహించారు. అన్నసంతర్పణను ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ప్రారంభించారు. ప్రజలు సుఖసంతోషాలతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షిస్తూ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సగర కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా శ్రీనివాసరావు, తహసీల్దార్ టీవీ సతీష్, తదితరులు పాల్గొన్నారు. కల్యాణోత్సవాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.

విద్యాభివృద్ధికి కృషి చేస్తాం



పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తున్న దాతలు

కంకిపాడు: విద్యాభివృద్ధికి కృషి చేస్తామని దాతలు పేర్కొన్నారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పీకా జేమ్స్ విక్టర్ రాజు 11వ వర్ధంతి వేడుకలు కుందేరు గ్రామంలో మంగళవారం నిర్వహించారు. జేమ్స్ విక్టర్ రాజు కుమారులు పీకా బాలస్వామి, సుధాకర్ రావు, ఇమ్మానుయేలు, సుగుణాకర్‌రావు 2023 పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందించారు. వారు మాట్లాడుతూ తమ తండ్రి ఆశయాల సాధనకు కృషి చేస్తామన్నారు. విద్యాభివృద్ధి, ప్రతిభావంతులైన విద్యార్థులకు చేయూత అందిస్తామని పేర్కొన్నారు. తొలుత జేమ్స్ విక్టర్ రాజు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తోట్లవల్లూరులో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకంలో అన్నదానం చేయించారు.

భర్తపై భార్య హత్యాయత్నం

పెనమలూరు: భర్తపై హత్యాయత్నం చేసిన భార్యతో పాటు పలువురు వ్యక్తులపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిశోర్‌బాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గోసాలకు చెందిన పోలానికిరణ్ 14 ఏళ్ల క్రితం విజయవాడ చిట్టినగర్‌కు చెందిన రామాదేవిని వివాహం చేసుకున్నాడు. వీరికి ముగ్గురు పిల్లలు. కాగా కిరణ్ గంజాయి తాగే అలవాటుతో పాటు పలు దొంగతనాలు చేయటంతో అతనిపై పలు కేసులు నమోదు చేయటంతో జైల్‌లో ఉన్నాడు. నెలరోజుల క్రితం రాజమండ్రి సెంట్రల్ జైల్ నుంచి వచ్చాడు. కాగా అతని భార్య రమాదేవి వణుకూరుకు చెందిన ఉయ్యూరు మహేష్‌తో సంబంధం పెట్టుకుంది. భర్తలను అడ్డు తొలగించాలని భార్య, ఆమె ప్రియుడు పథకం రచించారు. ఈ నెల 29వ తేదీన కిరణ్ విజయవాడలో ఉండగా షాలోమ్ రాజు ఫోన్ చేసి గంజాయి తీసుకు వచ్చాడు. ఇద్దరు గంజాయి తాగారు. ఆ సమయంలో విజయవాడకు వచ్చిన ఉయ్యూరు మహేష్ మరి కొందరు ఆటోలో కిరణ్‌కు కిడ్నాప్ చేసి వణుకూరు గ్రామ శివారుకు తరలించారు. అక్కడ భార్య రమాదేవి, సుభాని, షాలోమ్‌రాజు, మరి కొందరు కాలసి కిరణ్ పై విచక్షణారహితంగా దాడి చేశారు. ఉయ్యూరు మహేష్ కత్తితో కిరణ్‌కు గాయపరిచారు. తీవ్ర గాయాలతో పడిపోయి అపస్మారక స్థితిలో ఉన్న కిరణ్‌ను దాడి చేసిన వారు వదిలి వెళ్లి పోయారు. స్థానికులు సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని గాయాలతో ఉన్న కిరణ్‌ను విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్సకై చేర్చారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో హత్యాయత్నం చేసిన భార్యతో పాటు మిగతా వారిపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

అత్తింటి వారిపై వరకట్నం వేధింపుల కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిశోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం కానూరు మహదేవపురం కాలనీకి చెందిన మాతా జాహ్నవి కామాక్షి రెండు సంవత్సరాల క్రితం విశాఖపట్నంకు చెందిన దివ్యసాగర్‌ను వివాహం చేసుకుంది. పెళ్లి సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. భర్త హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. అయితే భర్తతో పాటు అత్త సాయిశ్రీ, మామ రమణ, ఆడపడుచు మౌనిక, సమీప బంధువు సుభాషిణి అదనపుకట్నం కావాలని మాతా జాహ్నవి కామాక్షిని వేధించటంతో బాధితురాలు పుట్టింటికి వచ్చేసింది. అత్తింటి ఆగడాలపై పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

కంకిపాడు: విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనం అలవర్చుకోవాలని కంకిపాడు శాఖ గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ సూచించారు. వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. పుస్తక పఠనం, ఆసక్తి గల రంగాలను ఎంచుకుని ప్రావీణ్యం సాధించాలన్నారు. తెన్నేరు శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. స్పోకెన్ ఇంగ్లిష్‌లో శిక్షణ, క్యారమ్స్ పోటీలు ఏర్పాటు చేశారు. ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు. శిక్షణ కార్యక్రమాలను గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు.

కొనసాగుతున్న శిక్షణ తరగతులు

ఉయ్యూరు: గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. మండలంలోని కాటూరు గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చారు. వేమూరి బాబ్జీ పర్యవేక్షించారు. ఉయ్యూరు శాఖ గ్రంథాలయంలో గణిత ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు విద్యార్థులకు గణితంపై బోధించారు. శిక్షణ తరగతులను గ్రంథాలయాధికారి రమణి పర్యవేక్షించారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

గన్నవరం రూరల్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం అన్నారు. మంగళవారం స్థానిక గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా విద్యార్థులచే చిత్రలేఖనం, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. కథలు చెప్పించారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.జ్యోతి కుమారి ఆధ్వర్యంలో విద్యార్థులకు నీతి కథలు చెప్పారు. పేపర్ రీడింగ్ నిర్వహించారు.

● ఆత్మీయ పలకరింపు



విజయవాడలోని నిర్మల్ హృదయ్ భవన్‌ను మంగళవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా మైలవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకులు పడమట సురేష్‌బాబు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయంగా పలకరించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం



కేసరపల్లిలో ప్రశంస పత్రాలు అందుకున్న వలంటీర్లతో ప్రజాప్రతినిధులు



వీరవల్లిలో వలంటీర్లను సత్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి గ్రామ సచివాలయంలో మంగళవారం ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు పురస్కారాల ప్రధానం చేశారు. గ్రామ సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక అధ్యక్షతన ఇరువురు వలంటీర్లకు సేవావజ్ర, ఒకరికి సేవారత్న, 59 మంది వలంటీర్లకు సేవామిత్ర ప్రశంసపత్రాలను అందజేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ.గౌసాని, వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగరాజుకుమారి చేతుల మీదుగా వలంటీర్లను సత్కారించారు. వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు బొడ్డు అంజనేయవరప్రసాద్, పంచాయతీ కార్యదర్శి మౌనిక పాల్గొన్నారు.

ప్రజల మన్ననలు అందుకుంటున్న వలంటీర్లు

హనుమాన్‌జంక్షన్ రూరల్: సంక్షేమ పథకాల అమలులో నిస్వార్థ సేవలు అందిస్తున్న వలంటీర్లు రాజకీయాలకు అతీతంగా ప్రజల మన్ననలు పొందుతున్నారని ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ అన్నారు. వలంటీర్లను ప్రోత్సాహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'వలంటీర్లకు వందనం' సేవా పురస్కారాల కార్యక్రమం బాపులపాడు, వీరవల్లి గ్రామ సచివాలయాల్లో మంగళవారం ఘనంగా జరిగింది. వీరవల్లితో పాటుగా ఎ.సీతారామపురం, కోడూరుపాడు, బండారుగూడెం, రంగన్నగూడెం గ్రామాల వలంటీర్లకు, బాపులపాడుతో పాటుగా బొమ్ములూరు, కొయ్యూరు, శేరినరసన్నపాలెం, పెరికీడు, కొత్తపల్లి, బిళ్లనపల్లి గ్రామాల వలంటీర్లకు మండల పరిషత్ కార్యాలయంలో సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలను పంపిణీ చేశారు. గన్నవరం ఏఎంసీ డైరెక్టర్ గండేపూడి రాణి, వీరవల్లి పీఏసీఎస్ చైర్మన్ అల్లాడ థెరిస్సా పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

రామవరప్పాడు : ప్రతి గడపకు సంక్షేమ పథకాలను అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయమని ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం విజయవాడ రూరల్ పరిధిలోని 32 గ్రామ సచివాలయాల్లో ఉత్తమ గ్రామ వలంటీర్‌లకు ప్రశంస పత్రాలు, శాలువాలతో సత్కరించారు. ఎంపీడీవో బి.ఎల్.వి శేషగిరిరావు, జెడ్పీటీసీ సువర్ణరాజు, గన్నవరం మార్కెట్ యార్డ్ చైర్మన్ రామిశెట్టి అంజనీకుమారి, మాజీ ఎంఎంసీ చైర్మన్ కొమ్మా కోట్లు పాల్గొన్నారు.

వలంటీర్లకు సత్కారం

గన్నవరం రూరల్: సేవకు ప్రతిరూపం వలంటీర్లు అని సూరంపల్లి సర్పంచ్ పులపాక బాబూరావు కొనియాడారు. మంగళవారం స్థానిక సచివాలయం వద్ద వలంటీర్‌లకు జరిగిన సన్మాన కార్యక్రమంలో అభినందించారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన గ్రామస్తులందరికీ పార్టీ రహితంగా అందజేసిన వలంటీర్‌ల సేవలను కొనియాడారు. 17 మందిని సత్కరించారు. ఎంపీటీసీ సభ్యులు కొండా సీతారామయ్య, పంచాయతీ కార్యదర్శి కోట సురేష్‌బాబు పాల్గొన్నారు.



రామవరప్పాడు వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు



సూరంపల్లిలో సత్కారం పొందిన వలంటీర్లతో సర్పంచ్ బాబూరావు తదితరులు

దేశ చరిత్రలోనే సువర్ణ అధ్యాయం

నాలుగేళ్ల సంబరాలు



ప్రసాదంపాడులో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ సువర్ణరాజు

రామవరప్పాడు : ముఖ్యమంత్రిగా సీఎం జగన్మోహన్ రెడ్డి సువర్ణపాలన అందిస్తున్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగేళ్ల పూర్తయిన సందర్భంగా మంగళవారం విజయవాడ రూరల్ ప్రసాదంపాడులో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి మాట్లాడుతూ పథకాలతో ప్రజలను సోమరిపోతులు చేస్తున్నారన్న చంద్రబాబు తన మేనిఫెస్టోలో పేర్లు మార్చి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అమలవుతున్న పథకాలను చేర్చడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జెడ్పీటీసీ కాకర్లమూడి సువర్ణరాజు మాట్లాడుతూ ఎన్ని మోసపూరిత కుట్రలు పన్నినా రాష్ట్ర ప్రజలంతా సీఎం వైఎస్ జగన్‌తోనే ఉన్నారన్నారు. గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని రెట్టింపు చేస్తూ చారిత్రాత్మక పాలనకు శ్రీకాం చుట్టారన్నారు. గన్నవరం మార్కెట్‌యార్డ్ చైర్మన్ రామిశెట్టి అంజనీకుమారి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్. వెంకటేశ్వరరావు, రామవరప్పాడు సొసైటీ అధ్యక్షుడు సాదం వెంకటేశ్వరరావు, మాజీ ఉపసర్పంచ్ చెన్ను కమల్‌రాజు, ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.